క్లుప్తంగా

ట్రై సైకిల్ వితరణ



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నానికి చెందిన హరనాథ్‌కు రూ.35 వేల విలువగల బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్‌ను నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వితరణ చేశారు. ఈ క్రమంలో ట్రై సైకిల్‌ను హరనాథ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి గురువారం అందజేశారు. నేతలు జనార్దన్‌రెడ్డి, మహిధర్‌రెడ్డి, ఫణీంద్రనాయుడు, సంతోష్‌గౌడ్, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. భజనలు, స్వామివారి పల్లకిసేవను రాత్రి నిర్వహించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

రికార్డుల పరిశీలన



పొదలకూరు: పట్టణంలోని సచివాలయంలో రికార్డులను నెల్లూరు డీఎల్పీఓ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మండలంలో లేఅవుట్ల నిర్మాణంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమలు ప్రబలకుండా చూడాలని సూచించారు. ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, పంచాయతీ సెక్రటరీ అల్లాబక్షు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో నిమ్మ, మామిడి తోటలకు నష్టం



పొదలకూరు: ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షంతో నిమ్మ, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని అంకుపల్లి, పులికల్లు గ్రామాల్లో గురవారం సాయంత్రం ఉధృతంగా వీచిన ఈదురుగాలులతో నిమ్మ తోటల్లో చెట్లు నేలకొరిగాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. గాలులకు విద్యుత్ స్తంభాల తీగలు తెగిపడ్డాయని రైతులు తెలిపారు. నీరు పారించిన నిమ్మ తోటల్లో చెట్లు అధికంగా నేలవాలాయన్నారు.

కారును ఢీకొన్న లారీ

- చిల్లకూరు తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం



వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిల్లకూరు తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్‌కు ప్రమాదం తప్పింది. వివరాలు.. కారులో నెల్లూరు నుంచి చిల్లకూరుకు తహసీల్దార్ వెళ్తుండగా, వెనుక నుంచి లారీ ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంగా కారును నడపడంతో తహసీల్దార్‌కు ప్రమాదం తప్పింది. స్వల్పంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో కొలువైన శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్యనాయుడు, శ్రీనివాసులురెడ్డి, శ్యామ్‌ప్రసాద్, వేణుగోపాల్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విలుకానుపల్లిలో గురువారం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కరదీపికను మంత్రి అందజేశారు. నెల్లూరు – కోడూరు రోడ్డు నుంచి విలుకానుపల్లి మీదుగా పొట్లపూడి వరకు రూ.60 లక్షలతో నిర్మించిన తారురోడ్డును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 89కు గానూ 85 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బందికి రుణపడి ఉంటానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసి మిగిలిన వాటిని త్వరితగతిన నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని తెలిపారు. గత టీడీపీ హయాంలో మాదిరిగా కాకుండా శిలాఫలకాలు వేసిన అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తున్నామని వివరించారు. గ్రామాల్లో ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ముందు చూపు కారణంగా ఈ రబీ సీజన్లో రైతులకు సంబంధించిన ధాన్యానికి మంచి గిట్టుబాటు ధర లభించిందని వెల్లడించారు. విలుకానుపల్లికి సంబంధించి ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి పక్కా గృహాలను నిర్మించిచ్చామని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు శేషమ్మ, పార్టీ మండల కన్వీనర్ శంకరయ్యగౌడ్, నేతలు సుబ్బయ్యనాయుడు, రమేష్, వెంకటరమణయ్య, కిశోర్, కృష్ణ, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యం గౌడ్, చిరంజీవులుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకూడదు



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారి దేవస్థాన బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో అంగరంగవైభవంగా నిర్వహించాలని తహసీల్దార్ సుబ్బయ్య పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులతో సమీక్ష సమావేశాన్ని ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఈఓ శాంతయ్యతో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ఈ నెల 26 నుంచి జూన్ ఆరు వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని చెప్పారు. జూన్ 3, 5, 6వ తేదీల్లో నిర్వహించనున్న ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని, వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్, తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు, ఎస్సై వెంకటరాజేష్, ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ నిరంజన్‌నాథ్, నేతలు జనార్దన్‌రెడ్డి, మహిధర్‌రెడ్డి, ఫణీంద్రనాయుడు, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



ముత్తుకూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. చైర్‌పర్సన్, ఎంపీపీ సుగుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీడీఓ ప్రత్యూష, వైద్యాధికారి అనూష, తదితరులు హాజరయ్యారు. ఆస్పత్రి అభివృద్ధికి విడుదలయ్యే నిధులు, పరికరాల కొనుగోలుకు వెచ్చించే నిధులపై చర్చించారు. ముఖ్యమైన వ్యయాలకు ఆమోదం తెలిపారు. ప్రతి మూడు నెల్లకోసారి తప్పక సమావేశమవ్వాలని నిర్ణయించారు.

వలంటీర్లకు అవార్డులు

మండలంలోని వలంటీర్లకు అవార్డులను ప్రభుత్వం ప్రకటించిందని ఎంపీడీఓ ప్రత్యూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు వలంటీర్లకు సేవా రత్న అవార్డులు, 323 మందికి సేవా మిత్ర అవార్డులను ప్రకటించారని చెప్పారు. ఈ నెల 19 నుంచి 28 వరకు ఆయా గ్రామ సచివాలయాల్లో అవార్డులను ప్రదానం చేయనున్నారని వివరించారు.

అవార్డులకు 240 మంది వలంటీర్ల ఎంపిక

తోటపల్లిగూడూరు: అవార్డులకు మండలం నుంచి 240 మంది వలంటీర్లు ఈ ఏడాది ఎంపికయ్యారని ఎంపీడీఓ హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 234 మందికి సేవామిత్ర అవార్డులను అందజేయనున్నారని చెప్పారు. సేవా వజ్రగా సౌత్ ఆములూరు సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారన్నారు. జయంతి (చిన్నచెరుకూరు), సుప్రజ (సౌత్‌ఆములూరు), నారాయణమ్మ (పోట్లపూడి), దివ్యాంజలి (చిన్నచెరుకూరు), ఖాదర్‌మొహిద్దీన్(నరుకూరు) సేవా రత్నా అవార్డులకు ఎంపికయ్యారన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేయనున్నారని పేర్కొన్నారు.

'గడప గడపకూ మన ప్రభుత్వం'పై సమీక్ష



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని 6, 7వ వార్డుల్లో ఈ నెల 23న నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్షను నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ గురువారం నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొననున్నారని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు రెహమత్, షకీలా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు సతీష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

కోవూరు: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యనైనా సత్వరమే పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పార్వతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. చిన్న పొరపాట్ల కారణంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని సూచించారు. జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, సాయిలక్ష్మి, ఎంపీడీఓ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీలోని మూడో వార్డులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను కౌన్సిలర్ ప్రత్యూష గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మూడో వార్డులో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల పర్యటించారని, ఈ క్రమంలో సిమెంట్ రోడ్డును నిర్మించాలని స్థానికులు ఆయన్ను కోరారని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే సచివాలయ నిధుల నుంచి సిమెంట్ రోడ్డును నిర్మించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. పనులను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కౌన్సిలర్లు సత్యనారాయణ, నేతలు సురేష్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని మునులపూడి సచివాలయాన్ని ఎంపీడీఓ నరసింహారావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను పాటిస్తూ, స్పందన కార్యక్రమాన్ని రోజూ నిర్వహించాలని సూచించారు. సచివాలయ పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ విషయంలో పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యదర్శి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



వెంకటాచలం: దివ్యాంగులకు అండగా నిలవాలని దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రాజమణిపాల్ కోరారు. మండలంలోని సరస్వతీనగర్‌లో గల సీఆర్సీలో 123 మంది దివ్యాంగులకు వివిధ రకాల ఉపకరణాలను గురువారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు అవసరమైన అన్ని ఉపకరణాల పంపిణీతో పాటు వివిధ ఉపాధి కోర్సుల్లో శిక్షణనిచ్చి వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో సీఆర్సీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ వెంకటేశ్వరనగర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సూరయ్య (73) బుధవారం రాత్రి మృతి చెందారు. తెలుగుగంగ పునరావాస కేంద్రమైన వెంకటేశ్వరనగర్‌లో కీలక నేతగా ఈయన వ్యవహరిస్తున్నారు. సమాచారం అందుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. సూరయ్య కుమారుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు



అవగాహన కల్పిస్తున్న సుబ్బారావు

కొడవలూరు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై సుబ్బారావు హెచ్చరించారు. నార్తురాజుపాళెం ఆటో స్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. ఇలా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పక ఉంచుకోవాలని సూచించారు. పోలీసులిచ్చే నంబర్ విధిగా కలిగి ఉండాలని చెప్పారు. రాత్రి తిరిగే ఆటోలు అనుమతులను తప్పక పొందాలని సూచించారు.

యోగాతో ఆరోగ్య పరిరక్షణ



కొడవలూరు: యోగా సాధనతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని కొడవలూరు లైబ్రేరియన్ రాజేశ్వరి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యోగాపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు.

- యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. దేశ నాయకులు, వారి గొప్పదనం, నీతి కథలను గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి తెలియజేశారు. లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలి

పొదలకూరు: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు పొదలకూరులో గురువారం ఆయన మాట్లాడారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ మంచినీటిని అధికంగా సేవించాలని కోరారు. ఉపాధి కూలీలు, వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలన్నారు. తల తిరగడం, కనుగుడ్డు లోపల నొప్పిగా ఉండటం, శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే అధికంగా ఉండటం, వాంతులు, విరేచనాలు, తదితరాలు వడదెబ్బ లక్షణాలని చెప్పారు. ఓఆర్ఎస్‌ను తాగించడంతో పాటు దగ్గర్లోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఇందుకూరుపేట: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జనార్దన్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో తరగతిలో 40, నాలుగులో 35, ఐదులో 23, ఆరులో 28, ఏడులో ఆరు, ఎనిమిదిలో 15, తొమ్మిదో తరగతిలో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. గిరిజన విద్యార్థులకు మాత్రమే సీట్లను కేటాయించనున్నారని, ఆసక్తి గల వారు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 97039 20372, 93467 10400 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

21 నుంచి వీరభద్రేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాలు

మనుబోలు: మనుబోలులో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి శత వార్షికోత్సవ మహాకుంభాభిషేక మహోత్సవాలను ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహించనున్నామని అర్చకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. వీరభద్రస్వామి శత వార్షికోత్సవాలను గ్రామస్తుల సహకారంతో నిర్వహించనున్నామని చెప్పారు. స్వామివారికి నిత్యం మహాగణపతి హోమం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, దేవీ ఖడ్గమాలార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

యువకుడిపై దాడి

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెంలో యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన నలుగురు గురువారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. ముదివర్తిపాళేనికి చెందిన సుజయ్‌కు అదే ప్రాంతానికి చెందిన సాయికృష్ణకు పెళ్లి సంబంధ విషయమై వివాదం రేగింది. దీంతో సుజయ్‌పై సాయికృష్ణ, కుమారుడు శివ, వారి బంధువులు రామయ్య, నాగార్జున కత్తి, రాడ్లతో దాడి చేసి గాయపర్చారు. దీంతో చికిత్స నిమిత్తం బాధితుడ్ని నెల్లూరు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటసురేష్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలను ఆరాతీశారు.